క్లుప్తంగా

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 30న మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు గురువారం తెలిపారు. అలాగే 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ బడ్జెట్ సమావేశం కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులందరు సమయపాలనకు హాజరు కావాలని తెలిపారు.

తప్పులు లేని ఓటర్ల జాబితాయే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఓటర్ల జాబితాపై బీఎల్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 17 సచివాలయాల పరిధిలోని 33 వార్డుల్లో నూతనంగా నమోదు చేసిన ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారం 6, ఫారం 7, ఫారం 8లలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. మార్పులు, చేర్పులతోపాటు ఒక వ్యక్తికి ఒక చోట మాత్రమే ఓటు హక్కు ఉండేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్వోలు తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ పట్టణ కార్యదర్శిగా గిరిబాబు



గురజాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శిగా కర్రా గిరిబాబును నియమించినట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు తెలిపారు. గిరిబాబు నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకపత్రం అందించడం జరిగిందన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కర్రా గిరిబాబు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా ప్రతిష్టా విగ్రహాల ఊరేగింపు

విజయపురిసౌత్: స్థానిక దేశవరం క్యాంప్ తండాలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్టించే శ్రీమాత జగదాంబ, అభయాంజనేయ స్వామి, సద్గురు సేవాలాల్ మహారాజ్ విగ్రహాలకు గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా ఊరేగింపు జరిపారు. భక్తులు కోలాటం చేస్తూ నృత్యాలతో గ్రామ పురవీధుల్లో విగ్రహాలను ఊరేగించారు. శుక్రవారం జరిగే విగ్రహాల ప్రతిష్టా కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొననున్నారు.

రైతు ఆత్మహత్య

దుర్గి: మండల పరిధిలోని ముటుకూరు గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వర్లు (33) పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 3 ఎకరాల తన సొంత పొలంతో పాటు, మరో 4 ఎకరాలు కౌలు చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. మిర్చి పంటకు బొబ్బర తెగులు సోకి దెబ్బతినటంతో అప్పులు తీర్చలేనేమోనని భయపడి పురుగుమందు తాగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపారు. పొలానికి ఇంటికి తిరిగి రాకపోవటంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా పురుగుమందు తాగి పొలంలోనే చనిపోయి ఉండటాన్ని గమనించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ పీఆర్కే, రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పీవీఆర్‌లు కుటుంబసభ్యులను ఓదార్చారు.

అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

మాచర్ల: శ్రీరామ జన్మస్థలి అయోధ్యలో జనవరి 2024లో రామమందిరంలో శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ వారు అయోధ్యలో ప్రత్యేక పూజలు చేసి అక్షింతలు పంపి వాటిని పట్టణంలో భక్తులకు అందించాలన్న ఆదేశించినట్లు సభ్యులు పేర్కొన్నారు. పట్టణానికి రాములవారి అక్షింతలను పంపినట్లు సభ్యులు కందె పార్వతి, చెన్నకేశవాచార్యులు, శ్రీనివాసరావు, తెలిపారు. గురువారం పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు అందజేసి మాచర్ల పట్టణ, మండలం, పరిసర గ్రామాలలోని దేవాలయాలలో అక్షింతలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు పోలా శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావు, అఖిల భారత వాసవి సత్ర సముదాయాల సలహా మండలి సభ్యులు చిల్లంచర్ల సత్యనారాయణ, వాసు, చెన్నయ్య, రాజు, వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, నరసింహారావు, నాగేశ్వరరావు, గోవిందరాజులు తదితరులున్నారు.

మహిళ ఆత్మహత్య

పిడుగురాళ్ల: మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో జరిగింది. అంజిరెడ్డి హాస్పటల్ వెనుక బజారులో నివసిస్తున్న షేక్ బీబీ(30) గురువారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ బీబీకి గత ఏడు సంవత్సరాల క్రితం షేక్ బాజీతో వివాహం జరిగింది. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో భర్త నుంచి సుమారు నాలుగేళ్ల క్రితం విడిపోయి తల్లి ఫాతిమా వద్దనే బీబీ టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. ఫ్యాన్‌కు ఉరివేసుకొని మృతి చెందింది. ఈ ఘటనపై పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు నమోదు కాలేదని ఎస్ఐ కోటయ్య తెలిపారు.

ఉత్సాహంగా కొనసాగుతున్న ఆడుదాం ఆంధ్రా



విజేతలైన జెట్టిపాలెం క్రీడాకారులతో పీఈటీలు రవి, బ్రహ్మం, సుభాని



కారెంపూడి గురుకుల పాఠశాలలో జరుగుతున్న వాలీబాల్ పోటీ



పిడుగురాళ్ల జెడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

కారెంపూడి: మండలంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక బ్రహ్మనాయుడు జెడ్పీ హైస్కూల్లో క్రీడలను మండల ప్రత్యేక అధికారి జి.జోసెఫ్‌కుమార్ గురువారం క్రీడాకారులను పరిచయం చేసుకుని కబడ్డీ పోటీని ప్రారంభించారు. జెడ్పీటీసీ షేక్ షఫీ, ఎంపీడీవో జి.శ్రీనివాసరెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక గురుకుల పాఠశాలలో జరుగుతున్న వాలీబాల్ పోటీలను అధికారులు వీక్షించారు. మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో క్రీడలు జరుగుతున్నాయని ఈ క్రీడా సంబరం జనవరి 6వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఇదిలా ఉంటే ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ పోటీలు జెడ్పీ హైస్కూళ్లలో సంబరంగా జరుగుతున్నాయి.

ఆడుదాం ఆంధ్రాకు ఊరూరా విశేష స్పందన



కారెంపూడి జెడ్పీ హైస్కూల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మండల ప్రత్యేక అధికారి



క్రికెట్ ఆడుతున్న దృశ్యం

రెంటచింతల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ఊరూరా విశేష స్పందన లభిస్తున్నట్లు ఎంపీపీ దాసరి చొడేశ్వరి అన్నారు. గురువారం స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో జెట్టిపాలెం గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలో నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆమె వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మారుమూల ప్రాంతాలలోని యువతలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయడానికి ఈ కార్యక్రమం ప్రారంభించారని ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని ఉన్నతస్థాయికి చేరుకోవాలని కోరారు. యువత కూడా ఎంతో ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించడంతో పాటు ప్రజల నుంచి మంచి స్పందన రావడం సంతోషకరమన్నారు. క్రికెట్‌లో పి.రాజీవ్ టీం, వాలీబాల్‌లో హనుమాన్ టీం, కబడ్డీలో భవాని టీం విజయం సాధించి మండల స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పీఈటీ కత్తి రవి తెలిపారు. జెట్టిపాలెం సర్పంచ్ దావులూరి ఉదయకుమారి రమేష్, పీఈటీలు బ్రహ్మం, కళ్యాణి, సుభాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

పిడుగురాళ్లలో ఉత్సాహంగా..

పిడుగురాళ్ల: ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు పిడుగురాళ్ల పట్టణంలో ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గురువారం మన్నెం పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. మొత్తం నాలుగు టీమ్‌లు పాల్గొన్నాయి. అలాగే స్కాలర్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు జరిగాయి. నాలుగు టీమ్‌లతో నిర్వహించారు. ఆటలలో గెలుపొందిన క్రీడాకారుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఆటల పోటీల్లో క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆటలు ఆడుతున్నారని ఆయన తెలిపారు. ఈ నెల 30వ తేదీ వరకు కబడ్డీ, క్రికెట్ పోటీలు, 2024 జనవరి 2 నుంచి 5వ తేదీ వరకు వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు నిర్వహించటం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఈ ఆటల పోటీల్లో పీఈటీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని మండలంలోని పలు గ్రామాలలో నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ నాయకులు బూడిద శ్రీనివాసరావు అన్నారు. గురువారం జమ్మలమడకలో క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముక్కా గురవయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి సుజాత, వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు మున్నా రామకృష్ణ, గ్రామ పెద్దలు తదితరులున్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడాకారులకు వరం

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా గొప్ప వరం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. మండలంలోని గామాలపాడులో ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలను గురువారం ఆయన ప్రారంభించారు. క్రీడాకారులతో కలిసి వాలీబాల్, షటిల్ ఆడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను బయట ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేశారని, ప్రతి క్రీడాకారుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు జరిగే పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రభుత్వం అందజేస్తుందని ఆయన తెలిపారు.



గామాలపాడులో వాలీబాల్ ఆడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

ఆర్‌బీకేలలోనే కందులను విక్రయించండి

జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయి

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను చేపట్టిందని పల్నాడు జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ కుర్రి సాయిమార్కొండారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో రైతులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కందులకు మద్దతు ధర రూ.7వేలతో పాటు అదనంగా రూ.500 బోనస్ ప్రకటించిందన్నారు. కంది పంట రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కందులను అమ్ముకోవాలన్నారు. ఎంపీపీ ఏసూరి సాయి శంకర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరను ముందుగానే ప్రకటించారన్నారు. రైతుల కోసం పంట బీమాను ప్రభుత్వమే చెల్లించి రైతాంగ అభివృద్ధికి తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో మాచర్ల మార్కెట్ యార్డు చైర్మన్ తాడి వెంకటేశ్వరరెడ్డి, ఏవో వై.అమీర్‌రెడ్డి, ఎంపీడీవో సమతా వాణి, సర్పంచ్‌లు గంగారపు వెంకటరెడ్డి, బొబ్బా నాగిరెడ్డి, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ మార్కొండారెడ్డి, ఎంపీపీ సాయి శంకర్

మండలంలో 873 మందికి కళ్లజోళ్లు పంపిణీ

కారెంపూడి: మండలంలో కంటి చూపు సమస్యతో బాధపడుతున్న 873 మందికి ప్రభుత్వం కళ్లజోళ్లను ఆయా పీహెచ్‌సీలకు పంపింది. గాదెవారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్లు ఎం.విజయానాయక్, డాక్టర్ ఎం.లక్ష్మణరెడ్డి గురువారం కళ్లజోళ్ల పంపిణీని ప్రారంభించారు. గతంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాలలో కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో కళ్లజోళ్లు అవసరమైన వారికి ప్రభుత్వ కళ్లజోళ్లు వచ్చాయి. కారెంపూడి పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల వారికి 423, అలాగే గాదెవారిపల్లె పీహెచ్‌సీకి సంబంధించిన గ్రామాలకు 450 మందికి కళ్లజోళ్లు వచ్చాయి. జగనన్న సురక్ష వైద్య ఆరోగ్య శిబిరాలలో ఉచిత కంటి పరీక్షలు చేయడంతో పాటు ఇప్పుడు ఉచితంగా అందరికి ప్రభుత్వమే కళ్లజోళ్లను పంపడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ విజయానాయక్, డాక్టర్ లక్ష్మణరెడ్డి

మైనార్టీలను ఆదుకుంది వైఎస్ కుటుంబమే

అమరావతి: నాడు తండ్రి 4శాతం రిజర్వేషన్ కల్పిస్తే, నేడు తనయుడు మసీదులలో ఇమామ్, మౌజమ్‌లకు నెలనెలా గౌరవవేతనం ఇస్తూ ముస్లిం, మైనార్టీలను ఆదుకుంది వైఎస్ కుటుంబమేనని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ ఇమామిహూస్సేన్ అన్నారు. గురువారం అమరావతిలో మండల పరిధిలోని ఇమామ్, మౌజమ్‌లతో పాటు మసీదుల నిర్వాహకులకు హర్ దిల్ మే వైఎస్సార్-హమ్‌సబ్ జగన్ కే సాథ్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలను ఎంతో ఆదరించి వారి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మసీదులలో పనిచేసే ఇమామ్‌లకు, మౌజమ్‌లకు నెలనెలా గౌరవవేతనం ఇస్తున్నారన్నారు. మండలంలో 19 మసీదుల అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. అలాగే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సహకారంతో నియోజవర్గంలో కోట్లరూపాయల ఖర్చుతో షాదీఖానాలు నిర్మాణం చేస్తున్నారన్నారు. గత టీడీపీ హయాంలో కంటే నేడు జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధిని మైనార్టీసోదరులు గమనించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ షేక్ హుస్మీలతో పాటు 19మసీదుల ఇమామ్‌లు, మౌజమ్‌లు, నిర్వాహకులు పాల్గొన్నారు.



స్థానిక మదీనా మసీద్ వద్ద ప్రభుత్వ పథకాల బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అల్లర్లకు పాల్పడితే చర్యలు

బెల్లంకొండ: నూతన సంవత్సర వేడుకలను యువత ఎటువంటి గొడవలు, అల్లర్లు లేకుండా జరుపుకోవాలని ఎస్ఐ కె.అమీర్ తెలిపారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండలంలో ఎక్కడైన అవాంఛనీయ ఘటనలు జరిగితే అందుకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 31న రాత్రి తప్పనిసరిగా అన్ని చోట్లా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడతామని తెలిపారు. మైనర్‌లు ద్విచక్ర వాహనాలు నడపవద్దని సూచించారు.

పక్కా గృహాల కోసం గిరిజనులు నమోదు చేసుకోండి

వెల్దుర్తి: పక్కా గృహాలు లేని చెంచు గిరిజనులందరూ పీఎం జన్‌మన్ (ప్రధానమంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్) యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని మాచర్ల జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి అన్నారు. గురువారం మండలంలోని చెంచు గిరిజనులు పర్యటించి మాట్లాడారు. ఐటీడీఏ శ్రీశైలం పరిధిలో ఉన్న మూడు జిల్లాల చెంచు గిరిజన గూడేలలో నివసించే చెంచులకు సొంతింటి కల నెరవేరేలా గృహాల మంజూరు కొరకు మండల హౌసింగ్ అధికారులకు చెంచులందరూ ఇంటి వద్దనే ఉండి నమోదుకు అవసరమైన ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఉపాధి జాబ్ కార్డు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఇంటి పట్టాలు, ఇల్లు లేని వారు తమకున్న స్థలాలను హద్దులతో నమోదు చేసుకోవాలన్నారు. ఐటీడీఏ శ్రీశైలం ప్రాజెక్టు డైరెక్టర్ బి.రవీంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈ విషయాన్ని తెలియజేయటం జరిగిందన్నారు. అర్హులైన చెంచు లబ్ధిదారుల వివరాలు నమోదయ్యేలా సంబంధిత హౌసింగ్ అధికారులు, సిబ్బంది చూడాలన్నారు. ఈ అవకాశాన్ని చెంచు, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీవారికి ప్రత్యేక పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వెంకటేశ్వరస్వామి దేవాలయం, రైల్వే స్టేషన్ రోడ్‌లోని అలివేలు మంగ పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి దేవాలయంలో గురువారం శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రైల్వే స్టేషన్ రోడ్‌లోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో శ్రీవారికి మలయప్ప అలంకారం చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

బెల్లంకొండ: శీతాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండలంలోని చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు అన్నారు. గురువారం పీహెచ్‌సీలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ చలికాలంలో వచ్చే చర్మ వ్యాధులు పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. దోమ కాటు ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్‌ఫ్లూ తదితర విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల బారిన పడకుండా మందులను పంపిణీ చేశారు.

ట్రక్కు తిరగబడిన ప్రమాదంలో వ్యక్తి మృతి

దొడ్లేరు(క్రోసూరు): మండలంలోని దొడ్లేరు గ్రామానికి చెందిన ఉల్లిగడ్డ కోటేశ్వరరావు(38) ధాన్యం బస్తాలు ఇంటికి చేర్చుకుంటూ ట్రాక్టర్ ట్రక్కు తిరగబడిన ప్రమాదంలో ట్రక్కు కింద పడి మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. ఎస్ఐ వి.నరసింహులు తెలిపిన వివరాల మేరకు ఉయ్యందన రోడ్డు మీదగా ధాన్యం బస్తాలు ఇంటికి తరలిస్తుండగా ట్రక్కు అదుపుతప్పి తిరగబడింది. కోటేశ్వరరావు బస్తాల కింద పడి మృతి చెందాడు. మృతుని భార్య తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గిరిజనుల అభివృద్ధికి పాటుపడింది జగనన్నే

మంత్రి అంబటి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన గిరిజనులు



టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి అంబటి, ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్

వెల్దుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న బృహత్తర అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో గిరిజనులు గురువారం చేరారు. మండలంలోని కొత్తపుల్లారెడ్డి గూడెంకు చెందిన కేతావత్ కస్నానాయక్ ఆధ్వర్యంలో గూడెంకు చెందిన కేతావత్ చిన్న హనుమానాయక్, మల్లునాయక్, లచ్చునాయక్, బాణావత్ లక్ష్మానాయక్, కేతావత్ చందూలాల్ నాయక్, బాణావత్ చిన మంత్రియనాయక్, మూడావత్ బంగ్యానాయక్, అంజినాయక్‌తో పాటు మరో 20 కుటుంబాలకు చెందిన వారు మంత్రి అంబటి సమక్షంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారికి జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అంబటి, పీఆర్కేలు మాట్లాడుతూ వీరి చేరికతో కొత్తపుల్లారెడ్డిగూడెంలో పూర్తి ఊరంతా వైఎస్సార్‌సీపీలో చేరినట్‌లైందన్నారు. సీఎం జగన్ గిరిజనుల పట్ల ఎంతో అభిమానంతో ఉన్నారన్నారు. అటవీ హక్కుల చట్టం ద్వారా భూములను పంపిణీ చేసి వారి కుటుంబాల అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. సీఎం జగన్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జరుగుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారికి అన్ని విధాలా సహకరిస్తామన్నారు. జగన్‌కు అందరం మద్దతుగా నిలిచి ఆయనను ముఖ్యమంత్రిని చేసేంత వరకు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొమ్మారెడ్డి చలమారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు మండ్లి పెద మల్లుస్వామి, మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు రాయంకుల గోపాల్, గ్రామ సర్పంచ్ బూడిద వెంకటేశ్వర్లు, నాయకులు పంగా చిన కాశయ్య, పోలకం వెంకటనారాయణ, బొమ్మిన అల్లయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

మనమంతా వైఎస్సార్‌సీపీ సైనికులం

మండలస్థాయి నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

దాచేపల్లి: మనమంతా వైఎస్సార్‌సీపీ సైనికులమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. నారాయణపురం మందపాటి నాగిరెడ్డి కల్యాణ మండపంలో మండలస్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మనమంతా కలిసికట్టుగా ఉండాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసేందుకు పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో సర్పంచ్ జంగా సురేష్, మాజీ ఎంపీపీలు అంబటి శేషగిరిరావు, భూషణం చెన్నయ్య, మాజీ సర్పంచ్‌లు కొమ్మారెడ్డి వెంకటరెడ్డి, మాశెట్టి పుల్లారావు, మాజీ ఎంపీటీసీలు ఆకూరి వీరారెడ్డి, దేవళ్ల వీరాస్వామి, కౌన్సిలర్ షేక్ షరీఫ్, మందా బెంజిమెన్, మందా శంకర్, గద్దల వేదమణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

ఈవీఎంల పనితీరుపై అవగాహన

వెల్దుర్తి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు నాయక్ అన్నారు. గురువారం మండలంలోని శిరిగిరిపాడు గ్రామంలో ఓటర్లకు ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పించామన్నారు. ఈవీఎం యంత్రాలపై అనుమానాలుంటే నివృత్తి చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. అర్హులై ఉండి ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు కాని వారుంటే నమోదు చేసుకుంటే విచారించి ఓటు హక్కు కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ రాజశేఖర్ నాయక్, వీఆర్వోలు, బీఎల్వోలు, ఓటర్లు పాల్గొన్నారు.



శిరిగిరిపాడులో ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ కోటేశ్వరరావు

రచ్చమల్లపాడులో వాటర్ సెక్యూరిటీ బడ్జెట్‌థింగ్

వెల్దుర్తి: మండలంలోని రచ్చమల్లపాడు గ్రామంలో వాటర్ ఎయిడ్ ఇండియా ఆధ్వర్యంలో వాటర్ సెక్యూరిటీ బడ్జెట్‌థింగ్ చేస్తున్నామని బ్లాక్ కో ఆర్డినేటర్ మారబోయిన గురుప్రసాద్ గురువారం తెలిపారు. గా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా గ్రామానికి వర్షాల ద్వారా, బోర్ల ద్వారా సంవత్సరంలో ఎన్ని లక్షల లీటర్ల నీరు అందుబాటులో ఉన్నాయనే విషయం తెలుస్తుందన్నారు. గ్రామంలో ప్రజలు, పశువులు, పొలాలకు ఒక సంవత్సరానికి ఎన్ని లక్షల నీరు అవసరమో తెలుస్తుందన్నారు. ఒక సంవత్సర కాలంలో అందుబాటులో ఉన్న నీరు కంటే వినియోగించుకొని నీరు తక్కువ ఉంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఇప్పటికే గ్రామంలోని ఎస్సీ కాలనీలో 10వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మంచినీటి ట్యాంకు నిర్మించామని, దీని ద్వారా 75 కుటుంబాలకు ఇంటి వద్దే మంచినీరు అందిస్తున్నామన్నారు. వాన నీటిని పరిరక్షించి భూమిలోకి ఇంకింప జేసే మూడు నిర్మాణాలు జరిగాయన్నారు. కార్యక్రమంలో రాజశ్రీ, రామాంజి, రోజారాణి గ్రామస్తులు పాల్గొన్నారు.



రచ్చమల్లపాడులో రైతులతో మాట్లాడుతున్న వాటర్ ఎయిడ్ ఇండియా బ్లాక్ కోఆర్డినేటర్ ప్రసాద్

మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యుల ప్రమాణస్వీకారం

మాచర్ల: దాల్ మిల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మాచర్ల పట్టణానికి చెందిన కొత్తమాసు బ్రహ్మారావును ఎంపిక చేశారు. అనేక సంవత్సరాలుగా పట్టణంలో దాల్ మిల్ నిర్వహిస్తున్న బ్రహ్మారావును మరోసారి అసోసియేషన్ అధ్యక్షులుగా బుధవారం ఎంపిక చేశారు. గురువారం గుంటూరు రోడ్డులోని దాల్ మిల్ అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారానికి పల్నాడు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ మిల్లర్లు రైతులకు మేలు చేసేలా కృషి చేయాలన్నారు. మిల్లర్లకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు విధాలుగా మేలు చేశారన్నారు. వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో మిల్లులు నిర్మించటం సంతోషకరమన్నారు. కొత్తమాసు బ్రహ్మారావుతో పాటు నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం సభ్యులను పలువురు శాలువాలు, పూలమాలలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, డాల్, రైస్ మిల్లర్ల యజమానులు, కొత్తమాసు వెంకటేశ్వర్లు, కొత్తమాసు మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



అసోసియేషన్ అధ్యక్షుడు, సభ్యులతో ప్రభుత్వ విప్ పీఆర్కే, పీవీఆర్‌లు